# చేప కన్నుల చిన్నది

## -ఎస్.మోహనహరి

మా నాన్నగారు నీలిని మా ఇంటికి తీసుకొచ్చినప్పుడు ''ఎంత అందంగా వుందీ అమ్మాయి'' అనుకున్నాను.

ఆ అమ్మాయి వయసు మా చెల్లెలు వయసు ఒక్కటే. పదేళ్లు . మంచి చలాకీపిల్ల. ఆర్నెల్లలో మాలో ఒకటిగా చేరిపోయింది.

ఎవరికి ఏం అవసరమొచ్చినా చకచకా పనులు చేసేస్తుంది. అందరి తలలో నాలుకలా వుంటోంది. నన్ను చూస్తే మాత్రం సిగ్గుపడేది. ఓరగా నావైపు చూసేది.

మూడు బెడ్‌రూములున్న ఇల్లు. ఇంటి చుట్టూ రెండెకరాల స్థలంలో చుట్టూ కాంపౌండ్ వాల్ కట్టించాం. లోపల మామిడి చెట్లున్నాయి. అన్ని రకాల పూల చెట్లూ వున్నాయి.

ఇంటా బయటా శుభ్రత ఉందంటే అది నీలి పడుతున్న శ్రమ ఫలితం అని నాకు నమ్మకం ఏర్పడిపోయింది.

మా అమ్మ అనారోగ్య కారణం వల్ల నా పెళ్లి తొందరగా చేసారు. అప్పుడు నీలి కళ్లల్లో నిరాశని గమనించాను.

మా అమ్మ పోయిన సంవత్సరంలోపే మా నాన్నగారు కాలం చేసారు. ఇంటికి పెద్దవాడ్ని. బాధ్యత నా నెత్తిమీద పడింది. ఆరు ఎకరాల పొలం పనిలో పడిపోయాను.

కొన్నిసార్లు కాలం తొందరగా దొర్లిపోతుంది.

మా చెల్లి మెచ్యూర్ అయింది. ఒక నెల వ్యవధిలో నీలి కూడా....! కాకపోతే మా చెల్లి పక్కింటి భాస్కర్‌తో చాటుమాటున కలుసుకుంటూ వుంటే గత్యంతరం లేక అన్వేషణ మొదలుపెట్టాను.

వెయ్యి అబద్ధాలు ఆడి మా చెల్లె పెళ్లి చేసాను. మా బావగారు బాగా చదువుకున్నవాడు. పట్నంలో ఉద్యోగం చేస్తున్నాడు. ఒక ఎకరం పోతే పోయింది. మా చెల్లాయిని ఒక అయ్య చేతిలో పెట్టాను.

మా చెల్లాయి అత్తవారింటికి వెళ్లాక నీలికి మా ఆవిడతో మరింత చనువెక్కువైంది. నవ్వుతూ పనిచేస్తూ మా ఆవిడ మనసుని గెలుచుకుంది.

నిజానికి నీలి చాలా బాగుంటుంది. చేపకన్నుల చిన్నది. మీన నేత్ర. ఆమె కళ్లు కలలు కంటున్నట్లుంటాయి. అందం కోసం అతికించినట్లుందామె నాసిక.

లేత నిమ్మపండులాంటి నీలిని చూసి మంత్రమానులాంటి మగాడు కూడా ఆమె పరువానికి పరవశించకపోడు. ముఖ్యంగా దాని చిరునవ్వు అందంగా వుంటుంది. ఆ చిరునవ్వే ఒక అద్భుతమైన ప్రకృతిలా వుంటుంది.

ఒక్కోసారి నీలి అమాయకమైన కళ్లు చూసి అనుకుంటూ వుంటాను. ''అందమెంత గొప్పదో అమాయకత్వం అంత గొప్పది'' అని.

ఎప్పటిలాగే పండక్కి మా చెల్లాయి, బావగారు వచ్చారు.

మా బావగారు ఏమీ తెలీని సుద్దపూస అనుకున్నాను. నా అంచనా తప్పయింది. అతని కళ్లు నీలిమీద పడ్డాయి. పదేపదే ఏదో ఒక వంకతో అతను నీలి దగ్గరకు వెళ్తుంటే మా చెల్లాయి పసి కట్టేసింది. దాని మొహంలో కోపం, ఈర్ష్య , రోషాలు అలుముకుంటున్నాయి.

అత్తమీద కోపం దుత్తమీద చూపించినట్టు ''అప్పుడంటే ఏదో చిన్నపిల్ల. ఇప్పుడుకూడా దాని పకపకలు ఇకఇకలు చూసి ఏ మగాడు మాత్రం ఊరుకుంటాడు? ఎక్కడకు పోతుందా బుద్ధి?'' అంటూ నీలి ముఖంమీదే పరుషంగా మాట్లాడ్డం మొదలుపెట్టింది. నీలి మౌనంగా వుంటోంది.

''బావగారూ! ఇది పల్లెటూరు. మీ పట్నం పోకడలు ఇక్కడ పని చేయవు. జాగ్రత్త'' నవ్వుతూ హెచ్చరించాను.

''వదినా! ఎందుకైనా మంచిది. దాని మీద ఒక కన్నేసి పెట్టు. బారెడు జడలో నాలుగు మూరల పువ్వులు పెట్టుకుని కవ్విస్తూ రాసుకుని పూసుకుని తిరుగుతుంటే ఏ మగాడు వూరుకుంటాడు'' అక్కసుగా అంటోంది మా చెల్లాయి.

నేను అంతా వింటున్నాను.

''ఛ... అది అట్లాంటిది కాదే'' మా ఆవిడ నీలివైపు వకాల్తా పుచ్చుకుంది.

''అయ్యో! అది కాదు వదినా. మగాడి మనసు మైనపు ముద్దలాంటిది. ఆడదాని చిన్న సెగ తగిలితే చాలు. ఇట్టే కరిగిపోతాడు. ఆ తర్వాత నీ ఇష్టం.''

నవ్వుకున్నాను. గుడ్డొచ్చి కోడికి సలహా ఇచ్చిందిట. అట్లా వుంది మా చెల్లాయి సంగతి. పట్నం వెళ్లాక దాని ఆలోచనలే మారిపోయాయో లేక మా బావగారి సాంగత్య ప్రభావమో, కాకపోతే నీలి మీదున్న అక్కసుతో అలా మాట్లాడుతోంది.

మొత్తానికి నా తప్పొకటి తెలుసుకున్నాను.

ఇప్పుడు నీలి చిన్నపిల్లకాదు. ఈడొచ్చిన పిల్ల. ఎవరైనా బీదవాడు, మంచివాడు దొరికితే దాని పెళ్లి కూడా చేసేస్తే ఏ సమస్యా వుండదు.

నీలి గురించి ఆలోచిస్తూ నిద్రపోయాను.

కడుపులో ఏదో గడబిడ. నెమ్మదిగా లేచి పెరట్లోకి వెళ్లాను. చీకటి ఎప్పుడో ముదిరింది. ఆకాశం తన ఒంటిమీద నల్లరంగు పులుముకున్నట్టుంది. పైనుంచి చలి కొరుక్కు తింటోంది.

నాలుగు అడుగులు ముందుకు వేసానో లేదో మామిడిచెట్టు వైపు నుంచి గుసగుసలు, గాజుల గలగల సవ్వడి వినిపించింది.

కళ్లు చిట్లించి చూసాను. కదలకుండా నిల్చున్నాను.

కొన్ని మాటలు సన్నగా వినిపిస్తున్నాయి.

''ఎందుకు భయం? నీ మొగుడికి తెలుస్తుందనా? తెలిస్తే ఏం? ఇలా మనిద్దరిని చూసాడంటే ఉరేసుకుని చస్తాడు. అయినా ఇలాంటి చాటు వ్యవహారం నడిపేటప్పుడు భర్తని గుప్పిట్లో పెట్టుకోవాలి. నువ్వు వట్టి దద్దమ్మివి. నన్ను చూడు. నీ కోసం తెగించి అంతెత్తు గోడ దూకి మీ పెరట్లోకి వచ్చాను''

ఆ గొంతు గుర్తు పట్టాను. పక్కింటి ప్రకాశ్‌ది.

''సర్లే. ఇంకా ఎంతసేపు? ఎవరైనా వస్తారు?''

అది సాక్షాత్తు నా ముద్దుల చెల్లెలి గొంతు.

''నిన్ను మాత్రం వదిలేస్తానని అనుకోకు. నా సంగతి నీకు బాగా తెలుసు.

''అబ్బ తొందరగా...''

ఇహ లాభం లేదనుకున్నాను. సన్నగా దగ్గాను.

గుసగుసలు ఆగిపోయాయి. గాజుల సవ్వడి ఆగిపోయింది.

కానీ అప్పుడే గదిలోంచి పెరట్లోకి వస్తున్న బావగారిని చూసాను.

''దేవీ! దేవీ'' భార్యని పిలుస్తున్నాడతను.

బిత్తరపోయాను. భయం అతి దారుణంగా గుండెని వత్తేస్తోంది.నోట మాట రావడంలేదు. నుదుటంతా చెమట పట్టేసింది. లుంగీతో చెమటని తుడుచుకున్నాను. కానీ చెమట ఆగడంలేదు.



ఒంట్లోని నీరంతా ఆవిరైపోతున్నట్లుంది. పెదవులు ఎండిపోతున్నాయి. నాలుక పిడచకట్టుకుపోతోంది.

నా చెల్లి చేస్తున్న ఘనకార్యం బావకి తెలిస్తే ఇంకేమైనా వుందా?

శ్వాస వినిపించేంత నిశ్శబ్దం.

నా కళ్లు తిరుగుతున్నాయి. తప్పు చేస్తున్నది వాళ్లిద్దరా? నేనా? అన్నంత బాధ కలుగుతోంది.

సరిగ్గా అప్పుడే... ఎక్కడ్నుంచి వచ్చిందో నీలి అకస్మాత్తుగా నా దగ్గరకు వచ్చింది. ఏం జరుగుతుందో తెలిసేలోగా నీలి ఒడుపుగా నన్ను లతలా వాటేసుకుంది.

కాళ్లు మడమలెత్తి నా పెదవులమీద ముద్దుల వర్షం కురిపిస్తోంది.

పరాయి స్త్రీ స్పర్శ. అదీ కన్నెపిల్ల స్పర్శ.

ఒక భయం, ఒక బెదురు.

శరీరంలోని అణువణువులో వణుకు.

పూలచెండుతో బంధించినట్లు ఉక్కిరిబిక్కిరయిపోతున్నాను.

ఒక చోట ఆమె ఒళ్లు మెత్తగా తగులుతోంది.

మరో చోట గట్టిగా తగులుతోంది.

ఇంకొక చోట మృదువైన స్పర్శ.

ఆమె పెదవుల నుంచీ నా పెదవుల్ని తప్పించాలని తలని అటూ ఇటూ తిప్పుతూ ప్రయత్నిస్తున్నాను. సాధ్యం కాలేదు.

బావ మా దగ్గరకు వచ్చాడు. మా ఇద్దరిని చూసాడు. గుర్తు పట్టాడు.

''ఛీ...ఛీ సిగ్గులేదు. మగాడికి లేకపోయినా పెళ్లికాని పిల్లవి నీకైనా సిగ్గుండాలి. పెళ్లయిన వాడితో కులుకుతున్నావ్. ధూ...ఎక్కడ పోతుందా బజారు బుద్ధి?'' చక్కున ఇంట్లోకి వెళ్లిపోయాడు.

అప్పటికే నా చెల్లెలు ఇంట్లోకి వెళ్లిపోయింది. పక్కింటి ప్రకాష్ మెల్లగా చీకట్లోకి కలిసిపోయాడు.

మళ్లీ నిశ్శబ్దం. ఆ నిశ్శబ్దంలో నేనూ, నీలి నిల్చున్నాము.

నేను నీలిని చూస్తున్నాను. నీలి తలొంచుకుని నిల్చుంది.

''కావాలని తప్పు చేసాను. మీ బావగారికి అసలు సంగతి తెలిస్తే మనింటి అమ్మాయి సంసారం కూలిపోతుందని ఇలా చేసాను'' సంజాయిషీ చెబుతోంది నీలి.

నా మనస్సు మౌనంగా రోదిస్తోంది.

నీలివైపు కృతజ్ఞతాపూర్వకంగా చూసాను.

అమాయకంగా కనిపించే నీలిలో ఇంత తెలివి, ఇంత తెగింపు, ఇంత సమయ స్ఫూర్తి, ఇంత త్యాగభావం వుంటుందని నేనెప్పుడూ అనుకోలేదు.

నీలి వ్యక్తిత్వం ఎంత గొప్పది!

అందుకే-

అప్రయత్నంగా చేతులెత్తి దణ్ణం పెట్టాను.

''వద్దు బాబుగారూ! మీ ఉప్పు తింటున్నదాన్ని'' అంటోంది నీలి.

ఆమె కళ్లల్లో నీళ్లు తిరుగుతున్నాయి. ఆమె పలికే మాటలే సాక్ష్యం చెబుతున్నాయి. చేప

క ళ ్ల ల

చిన్నదానిలో ఒకలాంటి మెరుపు ఆ చిక్కటి చీకట్లో.

నేను మౌనంగా ఇంట్లోకి నడిచాను.

పక్క గదిలోంచి మాటలు వినిపిస్తున్నాయి.

నిల్చున్నాను.

''మీరూ చూసారా? నేనూ దాని కుక్క బుద్ధిని చూస్తున్నాను. మిమ్మల్ని చూసి ఇంట్లోకి వచ్చేసాను'' అంటోంది గారాబంగా పెరిగిన నా చెల్లెలు.

పిచ్చిపిచ్చిగా, సన్నసన్నగా నవ్వుకుంటూ నా బెడ్‌రూమ్‌కి దారి తీసాను.

★